



తెలుగు తమ్ముళ్లలో అంతర్మథనం



బిజెపితో పొత్తుతో టికెట్లపై ఆందోళన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిన చందాన' బిజెపితో తెలుగుదేశం పార్టీ పెట్టుకున్న పొత్తుతో తమ టికెట్లకే ఎసరు వస్తుందన్న ఆవేదన తెలుగు తమ్ముళ్లను కలచివేస్తోంది. వైసిపిని, ముఖ్యంగా వైఎస్ జగన్‌ను ఏదో చేసెయ్యాలనే ఆలోచనతో తమ అధినేత తీసుకున్న విధానంపై సర్వత్రా నివురుగప్పిన నిప్పులా ఆ పార్టీ నేతల పరిస్థితి కనిపిస్తోంది. ఈ పొత్తు రాజకీయంగా లాభిస్తుందా? అవస్థల్లో పడేస్తుందా? అన్న మీమాంశ విశాఖలో సర్వత్రా టిడిపి శ్రేణుల్లో నెలకొంది.

గుమ్మనంగా టిడిపి శ్రేణులు...

గాజువాక, విశాఖ సౌత్, తూర్పు, పశ్చిమ, భీమిలి, ఉత్తరం ఇలా ఎక్కడ చూసినా టిడిపి శ్రేణులు గుమ్మనంగా ఉన్నాయి. ఏ విషయంపైనా చర్చించేందుకు ఎక్కడా సిద్ధం కావడం లేదు. తమ అధినాయకుడు చంద్రబాబు తీరుపై లోలోపలే మదన పడుతూ ఎవ్వరికీ చెప్పుకోలేని స్థితిలో పడ్డారు. జనసేన పార్టీతో కలవడం ప్లస్‌గానే భావించిన వీరంతా బిజెపి తోడవ్వడంతో టికెట్లను కోల్పోవడమే కాకుండా ప్రజల్లో బిజెపికి గల అప్రతిష్ట తమకు అంటుతుందన్న ఆవేదనతో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బిజెపితో ఏపికి గాని, విశాఖకు గాని జరిగిన మేలు ఏమీ లేకపోవడంతో ప్రజల్లో ఈ అంశం బలంగా ఉండడంతో 2024 ఎన్నికల్లో దెబ్బ తగులుతుందన్న ఆందోళనను టిడిపి శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. 2014లో రాజకీయ సీను మళ్లీ ఏపిలో రిపీట్ కానుందంటూ ఇంకొంతమంది టిడిపి శ్రేణులు పైకి వాపోతున్నారు.

ఏకీభావం ఎలా?

ఐతే, మూడు పార్టీల మధ్య సీట్ల పంపకంలో ఏకీభావం సాధ్యమా? అంటూ సీనియర్లు సైతం పెదవి విరుస్తున్నారు. జనసేనతో ఇప్పటికే టిడిపి కలిసి వెళ్తున్నందున కొన్ని సీట్లు తీసుకున్నా ఇబ్బంది రాదనుకున్న వారంతా బిజెపితో కూడా తమ పార్టీ కలవడంతో రాజకీయంగా రెండు రకాల మైనస్ ఉంటుందన్న భావన వినిపిస్తోంది. ఏపికి హోదా, రైల్వే జోన్ రాకుండా చేసిన బిజెపితో ఎలా టిడిపి జతకడుతుందన్న ఆక్రోషం దిగువ స్థాయి కేడర్‌లోనూ ఉంది. మైనారిటీ, దళిత, గిరిజన ఓట్లు కూడా టిడిపి కోల్పోతుందన్నది విశాఖలో అన్ని సెగ్మెంట్లలోనూ టిడిపి నాయకుల్లో నెలకొంది. మరోవైపు ఉత్తరం, గాజువాక, దక్షిణం వంటి చోట్ల అభ్యర్థులకు పోటీగా బిజెపి వాళ్లు వస్తున్నందున టిడిపి నేతల్లో అసంతృప్తి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో పెందుర్తి అసెంబ్లీ, దక్షిణ నియోజకవర్గం నుంచి టిడిపి ముఖ్య నేతలకు సైతం వైసిపి అధిష్టానం నుంచి ఫోన్‌కాల్స్ తాజాగా వస్తున్నాయి. ఇంకా విశాఖకు చెందిన పలువురు టిడిపి నేతలు సైతం వైసిపితో టచ్‌లో ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల నుంచి భోగట్టా తెలుస్తోంది.

విశాఖ సిటీ యూ టర్న్ అవుతుందా?

విశాఖ నగరంలోని నాలుగు అసెంబ్లీ సీట్లను 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. రాష్ట్రం అంతటా వైసిపి ప్రభంజనం కనిపించినా ఇక్కడ మాత్రం మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు టిడిపికే జై కొట్టారు. 2024 సంవత్సరం వరకూ ఈ రాజకీయ వాతావరణమే ఉన్నా... తాజా పొత్తులు కొంత దెబ్బతీస్తాయన్న ఆందోళన టిడిపి శ్రేణులే స్వయంగా వ్యక్తం చేస్తున్నాయి. గాజువాక నియోజకవర్గంలో బిజెపితో కలసి ఎలా కేంపెయిన్ చేస్తామని స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టి కార్మికుల నిరసన సెగ బిజెపికి లేదా? అంటూ జిల్లా నేతలను స్థానిక నేతలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్య నాయకుడు పల్లా శ్రీనివాసరావుకు చంద్రబాబు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. దీంతో ఈయన ముభావంగా ఉన్నారు. ఉత్తరంలో బిజెపి, టిడిపి, జనసేన పార్టీల బలం పోటీచేసే వారికి కలిసొచ్చే అంశంగా ఉంది. వైసిపి ఇక్కడే కాకుండా పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒంటరిగానే ఈ పార్టీలను ఎదుర్కోనాల్సి ఉంది. దక్షిణంలో అంతా గందరగోళంగా ఉంది. టిడిపి, జనసేన, బిజెపి కలయిక ప్రశ్నార్థకంగా మారింది. టికెట్ల కేటాయింపులో ఈ కూటమి అభ్యర్థిని సూచించలేని స్థితి కొనసాగుతోంది. తూర్పులో ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి మధ్య పోటీ స్పష్టంగా ఉంది. వైసిపి నుంచి బయటకు వెళ్లిన వారి నుంచి అధికార పార్టీకి అసమ్మతి పోరు ఇక్కడ ఉంది. గడచిన కొద్ది నెలల నుంచీ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి విశాఖపట్నం ఎంపీ ఎంవివి సత్యనారాయణ తీవ్రస్థాయిలో పర్యటనలు చేస్తూ తన బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. టిడిపి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు అతని అనుచర గణం గెలుపుపై ధీమాతో ఉన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోనూ టిడిపి, జనసేన, బిజెపి కూటమికి ఎదురుదెబ్బ తగిలే పరిస్థితి లేకపోలేదు. ప్రభుత్వ రంగ సంస్థలైన షిప్‌యార్డు, స్టీల్‌ప్లాంట్‌లను అమ్మేయాలనే బిజెపి కుట్రలపై పోరాడుతున్న కార్మికులు, ఉద్యోగులు ఈ సెగ్మెంట్ నుంచీ ఉన్నారు. వైసిపి అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ నియోజకవర్గమంతా కలియ తిరుగుతూ కొత్తగా పోటీకి దిగడంతో రాజకీయ వాతావరణం కలిసొచ్చేలాగ ఓటర్లను ఆకర్షించే పనిచేస్తున్నారు. ఇక్కడ సొంత పార్టీ వైసిపి నుంచి అసమ్మతి ఆడారికి లేకపోలేదు. బిజెపితో టిడిపి పొత్తు వల్ల నగరంలో ఓటర్లు యూ టర్న్ తీసుకునే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

నేడు జడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన 1 నుంచి 7వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం నిర్వహించనున్నట్లు జడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు తెలిపారు. రెండో స్థాయీ సంఘ సమావేశం జడ్‌పి సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, 5వ స్థాయీ సంఘ సమావేశం కూడా అదే సమయంలో జడ్‌పి వీసీ హాలులో జరుగుతుందని వెల్లడించారు. ఉదయం 11.00 గంటలకు నాల్గో స్థాయీ సంఘ సమావేశం జడ్పీ సమావేశ మందిరంలో, అదే సమయంలో వీసీ హాలులో మూడో స్థాయీ సంఘ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 12.00 గంటలకు ఒకటో స్థాయీ సంఘ సమావేశం జడ్‌పి సమావేశ మందిరంలో, అదే సమయంలో ఆరు, ఏడో స్థాయీ సంఘ సమావేశాలు వీసీ హాలులో జరుగుతాయని వివరించారు. జిల్లా అధికారులందరూ తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర ప్రగతి నివేదికలతో జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పట్టాలెక్కనున్న విశాఖపట్నం - పూరి వందే భారత్ రైలు

వాల్తేర్ డివిజన్‌లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్న మోడీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం కేంద్రంగా నడిచే విశాఖపట్నం - పూరి వందే భారత్ రైల్‌ను ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం 9:15 గంటలకు వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని, ఈ ప్రారంభ వేడుకను విశాఖ కేంద్రంగా నిర్వహిస్తున్నామని వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరవ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం డిఆర్‌ఎం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంగళవారం నరేంద్ర మోడీ మొత్తం 10 నూతన వందే భారత్ రైళ్లను ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని, అందులో విశాఖపట్నం - పూరి, సికింద్రాబాద్-విశాఖపట్నం ప్రయాణించేవి రెండు ఉన్నాయని తెలిపారు. సికింద్రాబాద్- విశాఖపట్నం మార్గంలో రెండ్ వందేభారత్ రైలును సికింద్రాబాద్ కేంద్రంగా ప్రధానమంత్రి మంగళవారం ప్రారంభిస్తారని వివరించారు. సికింద్రాబాద్ కేంద్రంగా ప్రతిరోజు ఉదయం సికింద్రాబాద్‌లో బయలుదేరి మధ్యాహ్నం విశాఖపట్నం చేరుకుని మరలా మధ్యాహ్నం విశాఖపట్నం నుండి బయలుదేరి రాత్రికి సికింద్రాబాద్ చేరుకుంటుందని ఆయన వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఆర్‌ఎం సౌరవ్‌ప్రసాద్

కోరాపుట్ సమీపంలోని డుమురిపుట్ ప్రాంతంలో రూ.3.5 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన గూడ్స్ షెడ్‌ను, వాల్తేరు డివిజన్‌లోని రూ.123 కోట్లతో కొత్తవలస - కోరాపుట్ డబ్లింగ్ లైన్‌ను, కొత్తవలస - కోరాపుట్ సెక్షన్‌లో బోడ్డవరం వద్ద రూ.47 కోట్లతో నిర్మించిన 7.3 కిలోమీటర్ల లైన్‌ను , కోరాపుట్- రాయగడ సెక్షన్‌లో రూ.131 కోట్లతో నిర్మించిన 14.6 కిలోమీటర్ల డబ్లింగ్ లైన్‌ను, రూ.142 కోట్లతో 9.2 కిలోమీటర్ల మేర నిర్మించిన విజయనగరం-టిట్లాఘర్ 3వ లైన్‌ను, విజయనగరంలో నూతనంగా నిర్మించిన రైలు కోచ్ రెస్టారెంట్‌ను మంగళవారం ప్రధాని మోడీ ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని తెలిపారు.

స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించే విధంగా వన్ స్టేషన్ వన్ ప్రోడక్ట్ స్కీమ్‌లో భాగంగా మంగళవారం 16 స్టాళ్లను మోడీ జాతికి అంకితం చేస్తారని, అందులో 13 ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మూడు ఒడిశా రాష్ట్రంలో ఉన్నాయని డిఆర్‌ఎం తెలిపారు. నూతన జోన్ భవన నిర్మాణం పై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అధికారుల కమిటీ స్థలాన్ని పర్యవేక్షిస్తుందని రిపోర్ట్ వచ్చిన అనంతరం మరిన్ని వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

విశాఖపట్నం పోర్టును సందర్శించిన ఐఎఎస్‌ల బృందం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఐఎఎస్‌గా ప్రమోషన్లు పొందిన వివిధ రాష్ట్రాల కేడర్‌కు చెందిన 16 మంది సభ్యులతో కూడిన ఐఎఎస్‌ల బృందం భారత్ దర్శన్‌లో భాగంగా విశాఖపట్నం పోర్టును సోమవారం సందర్శించారని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. ఆ బృందానికి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన వివరాలు, వాణిజ్య పరమైన అవకాశాలు, ఆధునికీకరణ, యాంత్రీకరణ పనులకు సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై చర్యలు తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యాన సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడుతూ, జర్నలిస్టులకు మూడు సెంట్లు ఇంటిస్థలం కేటాయింపు వెంటనే జరిగేందుకు వీలైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో కమిటీలు ఇప్పటికే జాబితాలను తయారు చేశాయని, ఫిబ్రవరిలో మరోవారం రోజులు దరఖాస్తుకు అవకాశం కల్పించడం ద్వారా మరికొందరు జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేశారని, దీని వల్ల తుది జాబితాను తయారు చేయాలని విజ్ఞప్తి చేశారు. జాబితాలోని జర్నలిస్టులకు ఆయా మండలాల్లో, జిల్లా కేంద్రంలో ఎంతభూమి అవసరమో అంచనాలు తయారుచేసి అందుబాటులో ఉన్న భూమి వివరాలను సేకరించాలని, భూమి అందుబాటు ఉన్న ప్రాంతాల్లో ధర నిర్ణయం జరిగి జర్నలిస్టులు ఎంతమొత్తం, ఎప్పటిలోగా చెల్లించాలో కమిటీలు నిర్ణయిస్తే అందుకు అనుగుణంగా జర్నలిస్టులు సంసిద్ధులవుతారని పేర్కొన్నారు. ఆర్థికంగా బలహీనస్థితిలో ఉన్నవారికి తగినంత సమయం ఇస్తే బాగుంటుందన్నారు. దీనిపై జెసి మయూర్ అశోక్ స్పందిస్తూ ఆనందపురం, అగనపూడిలలో ఇళ్ల స్థలాలు పరిశీలించామని, త్వరలో నిర్ణయం తీసుకొంటామని తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ ఉపాధ్యక్షులు బండారు శివప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యులు జి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు రూప వరప్రసాద్‌దేవ్ ఉన్నారు.



జాయింట్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

విభిన్న రంగాల్లో మహిళల రాణింపు

ప్రజాశక్తి - పరవాడ : విభిన్న రంగాల్లో విశేష ప్రతిభను ప్రదర్శిస్తూ మహిళలు తమ ఉనికిని నిరూపించుకుంటున్నారని విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ ఎండి డాక్టర్ పి.లాల్‌కృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, సోమవారం ఫార్మాసిటీ హబ్‌లోని సమావేశ మందిరంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు 'రాంకీ ఎంపవరింగ్ విమెన్స్ అవార్డులు' అందజేశారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎమ్వీ రామిరెడ్డి, కళావతి హాస్పటల్ ఎండి కళావతి, విశ్వనాథ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి, మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న గౌతమి (వ్యవసాయశాఖ), ఎం.దుర్గామణి (ఆరోగ్యశాఖ), బి.అనూష (మత్స్యశాఖ), మేరీ సువార్త (శిశు సంక్షేమం), వెన్నెల శశికళ (ఆదర్శ రైతు), బి.శ్రీదేవి (పోలీస్), రాజేశ్వరి (ఆశ కార్యకర్త), కె.సరస్వతి (స్వచ్ఛందసేవ), పెబ్బిలి హైమవతి (రచయిత్రి), వై.భాను (పర్యావరణం), ఎ.వి.సునీత (బాలికా సంక్షేమం), సుజాత (సాంఘిక సంక్షేమం)తో పాటు విశేష ప్రతిభ కనబరచిన 11 మంది రాంకీ సంస్థ ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. ఫార్మాసిటీ ప్రతినిధులు ఎర్రయ్య, గిరిధర్, రాంకీ ప్రతినిధులు కె.శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో అక్షర విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -వడ్డాది : విశ్వం ఎడ్యుటెక్ స్కూల్స్ అండ్ లాబ్స్ ఆధ్వర్యంలో విజయవాడ కానూరులోని మన కళ్యాణ వేదికలో ఈ నెల 10న నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ కాంపిటేషన్‌లో వడ్డాది అక్షర స్కూల్ విద్యార్థి హైత్రికా 2వ బహుమతి సాధించింది. ఫిబ్రవరి 3న జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన హైత్రికా రాష్ట్ర స్థాయిలోనూ 2వ బహుమతి సాధించింది. స్కూల్ ప్రిన్సిపల్ తగరంపూడి వరప్రసాద్ హైత్రికాను అభినందించారు.

గొర్రెలు, మేకలు పెంపకందారుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : గొర్రెలు, మేకలు పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నేతవానిపాలెం పెంపకందార్ల సహకార సంఘం అధ్యక్ష కార్యదర్శులు వియ్యపు పైడినాయుడు, బర్నికాన నాయుడు తదితరులు స్థానిక సచివాలయం పంచాయతీ కార్యదర్శి జ్యోతిరెడ్డికి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. గొర్రెలు మేకల తాగునీటి అవసరాలకు అనుగుణంగా జిల్లా పరిషత్ నిధుల నుండి మంచినీటి బోర్లు కుండీలను ఏర్పాటు చేయాలని, 50 శాతం సబ్సిడీతో రుణాలను మంజూరు చేయాలని, చనిపోయిన వారికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 15 సంవత్సరాలు దాటిన వారికి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ఈనెల 25 నుండి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణకు 10వ తరగతి, ఇంటర్ చదివిన వారికి అవకాశం ఉంటుంది. మరిన్ని వివరాలకు 8464077659 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా అభయాంజనేయస్వామి తీర్థం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి గ్రామ సమీపంలో సోమవారం అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. మాజీ ఎంపీటీసీ పెనగంటి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పంచాడ సింహాచలం నాయుడు, గ్రామ పెద్దలు వేపాడ నరసింహనాయుడు, బుదిరెడ్ల పాత్రుడు పాల్గొన్నారు.



ఎడ్ల పరుగు పందెం విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామ పెద్దలు, నిర్వాహకులు

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి-చోడవరం

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల పరిషత్తు సమావేశంలో ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా చోడవరం నియోజకవర్గానికి 150 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశామని, దాదాపుగా పనులన్నీ పూర్తయ్యాయని వెల్లడించారు. గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు, భూముల రీ సర్వేలో సమస్యలను పలువురు సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యారావు, తహశీల్దారు వేణుగోపాలరావు, ఎంపీడీవో రమామణి, వైస్ ఎంపిపి బుద్ద గంగరాజు, బైన కుమారి ఈశ్వరరావు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

బుచ్చయ్యపేట : వచ్చే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా జల్ జీవన్ మిషన్ పైపులైన్ల పనులు పూర్తి చేయాలని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు విజ్ఞప్తి చేశారు. సోమవారం బుచ్చయ్యపేటలో ఎంపిపి డి నాగేశ్వరీ దేవి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. దిబ్బిడిలో నిలిచి పోయిన ఇంటింటి కుళాయిలను పూర్తి చేయాలని, నీలకంఠాపురంలో వాటర్ ట్యాంక్ ప్రారంభించాలని, ఆర్.భీమవరం జగనన్న లేఔట్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరారు. రీ సర్వేలో భూముల రికార్డులు తారుమారైనట్లు ఆర్.భీమవరం సర్పంచ్ తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జెడ్‌పిటిసి దొండా రాంబాబు, ఎంపీడీవో వెంకటాచార్యులు, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌ఎవీఐఎస్ హెచ్‌ఆర్‌ర్ సంయుక్తంగా బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్, ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం పూర్తి చేసిన వారికి, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జపానీస్ భాష నేర్పించి జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 32 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందని, వసతి, ఇతర సదుపాయలను ప్రభుత్వం 50 శాతం భరిస్తుందని తెలిపారు. జీతం రూ.లక్ష నుంచి రూ.1.40 లక్షల వరకూ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు www. apssdc. in. home. onlineprogramregistration ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9908629287 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని నారాయణపాలెం గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన ఎలమంచిలి రవితేజ కుటుంబాన్ని అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం పెద్దలు సోమవారం పరామర్శించి ఓదార్చారు. తాత్కాలిక సహాయంగా రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బర్నికాన బాబురావు, సబ్బి శ్రీనివాస్, బర్నికాన నరసింహ మూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్పందన కార్యక్రమంలో సమర్పించే దరఖాస్తులను మరింత వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టన్ శెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 246 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఓ బి.దయానిధి, కెఆర్‌సిసి ఉప కలెక్టరు ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, భూసర్వే సహాయ సంచాలకులు ఎస్.గోపాలరాజ, డిఆర్‌డిఎ పిడి శచీదేవి స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 28 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని అదనపు ఎస్పీ విజయభాస్కర్ స్వీకరించారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పరవాడ : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జివిఎంసి గాజువాక జోనల్ కమిషనర్ బి సన్యాసి నాయుడు అన్నారు. మండలంలోని ఏడుమెట్ల మత్రిపాలెంలోని గొన్న కళాశాలలో సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు ఓటు హక్కు, దానిని సరిగా వినియోగించుకోకుంటే జరిగే పరిణామాలు గురించి వివరించారు. కార్యక్రమంలో గొన్న కళాశాల ప్రిన్సిపల్ పిఎస్‌ఎస్ మూర్తి పాల్గొన్నారు.

వైసిపిలో బయట పడ్డ విభేదాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వైసీపీలో వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మండలంలోని కోమల్లపూడి శివారు బుద్దిరెడ్డిపాలెం సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గేదెల వెంకయ్యమ్మ కుమారుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, పొట్టిదొర పాలెం ఎంపీటీసీ అర్జున అప్పారావు, గంటికొర్లం సర్పంచ్ సరకాని బాబురావు తదితరులు హాజరు కాలేదు. కొంతకాలంగా బుచ్చయ్యపేట వైసిపి రెండు వర్గాలుగా విడిపోయాయి. అధికారిక కార్యక్రమాలకు సైతం గేదెలు సత్యనారాయణ, కొలిమల్ల అచ్చంనాయుడు వర్గాలకు చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావడం లేదు. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ఒక వర్గం గైర్హాజరు కావడంతో నియోజకవర్గ స్థాయి నాయకులలో ఆందోళన నెలకొన్నట్లు సమాచారం.

ఆవఖండంలో అక్రమ లే-అవుట్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సౌత్ బి2 రెవెన్యూ పరిధిలో పచ్చని పంట పొలాలను విచ్ఛిన్నం చేసి, సుమారు పది అడుగుల పైనే ఎత్తి చేసి అక్రమ లేఔట్ నిర్మిస్తున్నా నేటి వరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సిపిఐ బృందం గురువారం ఆవఖండంలో నిర్మిస్తున్న అక్రమ లే అవుట్‌ను పరిశీలించింది. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై ఎన్ భద్రం, కే శంకర్రావు, ఆర్ దొరబాబు, టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడమే లక్ష్యంగా టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఉప్పల చంద్రశేఖర కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన టిడిపి అనకాపల్లి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ మంత్రి, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీష్ మాట్లాడారు. టీడీపి నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల మనోభావాలను గౌరవించి ప్రగడకు టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి- మునగపాక : టిడిపి కార్యకర్తల మనోభావాలను పార్టీ అధిష్టానం గౌరవించి పార్టీ యలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావుకు టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం పార్టీ సమావేశం జరిగింది. ప్రగడకు సీటు కేటాయిస్తే భారీ మెజారిటీతో గెలుస్తారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, నాయకులు దాడి ముసలి నాయుడు, ఆడారి మంజు, మొల్లేటి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

గెడ్డ వాగు కబ్జాపై నిరసన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఇరువాడ రెవెన్యూ పరిధిలోని రూ.18కోట్లు విలువైన గెడ్డవాగును అనకపల్లికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేసి, చెట్లు నరికివేసి ప్రహరీ నిర్మాణం చేస్తున్నారని, ఆ కబ్జాను వెంటనే ఆపాలని ఇరువాడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి, స్పందనలో ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహశీల్దార్ జె.చలమయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇరువాడ గ్రామస్తులు మాట్లాడుతూ ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 103, 106ల్లోని సుమారు 13 ఎకరాల 32 సెంట్లు గెడ్డవాగు ఉండగా, ఇందులో మూడు ఎకరాల వాగు భూమిని రియల్టర్ ఆక్రమించి పక్కనే ఉన్న సర్వే నంబర్ 105లో ఉన్న లేఅవుట్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ఈ విషయంపై 2023 నవంబర్‌లో టిడిపి నాయకులు బండారు సత్యనారాయణమూర్తి, గండి రవికుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గెడ్డవాగు, ప్రభుత్వ భూమి కబ్జాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బలిరెడ్డి అప్పారావు, కర్రి రమణమ్మ, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో ఎస్‌టి కమిషన్ సభ్యుడు పర్యటన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ ఈ నెల 13, 14 తేదీలలో అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. 13న మాడుగుల, వడ్డాది, గోవాడ ఎస్టీ వసతి గృహాలను సందర్శించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా ఉన్నతాధికారులతో, ట్రైబల్ నాయకులతో చోడవరం అంబేద్కర్ భవనంలో సమావేశం నిర్వహించనున్నారు. 14న ఉదయం 10 గంటలకు రోలుగుంట మండలం చీమలపాడు, ఆర్ల పంచాయితీలు, వాటికి దగ్గరగా ఉన్న గ్రామస్తులతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం రావికమతం మండలం, చీమలపాడు పంచాయితీలోని సలిసింగం, లోచింగి గ్రామాలను సందర్శిస్తారు. సాయంత్రం రావికమతం మండల అధికారులు ఆదివాసీ నాయకులతో రావికమతం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశమవుతారు.

మార్కెట్ కమిటీ సిబ్బందికి యూనిఫాం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బందికి సోమవారం చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా యూనిఫాం పంపిణీ చేశారు. ఎఎంసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి శకుంతల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వడ్డాది, దిబ్బిడి, బుచ్చయ్యపేట, పోలేపల్లి, రాజాం గ్రామాల్లో సిఆర్‌పిఎఫ్ బలగాలతో కలిసి బుచ్చయ్యపేట పోలీసులు సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తకోట సిఐ అప్పలనాయుడు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో శ్రీకృష్ణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : కర్ణాటక యోగ అసోసియేషన్, శివజ్యోతి యోగా సెంటర్ సంయుక్తంగా జనవరి 26 నుంచి 28 వరకూ నిర్వహించిన యోగోత్సవ-2024 ఆన్లైన్ పోటీల్లో అనకాపల్లి మండలం తుమ్మపాలలోని శ్రీకృష యోగా సెంటర్ నుంచి పాల్గొన్న విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో బుదిరెడ్డి నరసింగరావుకు గురుజ్యోతి అవార్డు, ప్రశంసా పత్రం, పదిమందికి యోగాజ్యోతి అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అవార్డులు పొందిన వారిని గ్రామ నాయకులు అభినందించారు.



అవార్డులు, ప్రశంసా పత్రాలతో యోగ అభ్యాసకులు

ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు చేదు అనుభవం

హామీల అమలు, సమస్యలపై నిలదీసిన జనసేన నేతలు



ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని సరిపల్లి గ్రామ సచివాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఐదేళ్ల క్రితం ఎన్నికల సమయంలో ఇచ్చిన డ్రైనేజీ నిర్మాణం, పాఠశాలలో ఆటస్థలం ఏర్పాటు హామీల అమలుతోపాటు హైస్కూల్‌లో నాడునేడు నిధుల దుర్వినియోగం, విద్యార్థినులకు కనీసం మరుగుదొడ్ల నిర్మించలేని దుస్థితి, ఇతర సమస్యలపై జనసేన నేతలు నిలదీశారు. జనసేన నేతలు గండ్రెడ్డి రమేష్ కోనేటి సాంబశివ, నీలంరెడ్డి సాయికిరణ్, కృష్ణ తదితరులు సమస్యలపై నిలదీయగా, కనీసం స్పందించకుండా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వెళ్లిపోయారు.

1124వ రోజుకు 'ఉక్కు'దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో వద్ద రిలేదీక్షలు సోమవారం 1124 రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు. పోరాట కమిటీ కోకన్వీనర్ ఆదినారాయణ మాట్లాడుతూ, ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, కార్మికులకు వేతన సవరణ వెంటనే చేపట్టి, పూర్తిస్థాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు విశాలాక్షినగర్ ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం వైసిపి తూర్పు సమన్వయకర్త, ఎంపి ఎంవివి సత్యనారాయణ. వార్డు కార్పొరేటర్ కోరుకొండ స్వాతిదాస్‌తో కలిసి ఆవిష్కరించారు. వైసిపి నేతలు అల్లంపల్లి రాజబాబు,గూడపాటి విక్టర్, మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, సురేష్, తారక్, భాస్కర్, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

ఆటో కార్మికులతో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- సీతమ్మధార : అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో ఉత్తర నియోజకవర్గ ఆటో కార్మికులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు మాట్లాడుతూ, విశాఖ పాలనా రాజధాని అయితే ఆటో కార్మికులకు మంచి రోజులు వస్తాయన్నారు. వైసిపి విజయానికి సహకరించాలని కోరారు. ఆటో కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, సాడిపద్మ రెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ళ లీలావతిశ్రీనివాస్, రేయి వెంకటరమణ, కెవిఎన్ శశికళ, కృష్ణారావు, బులుసు జగదీష్, కర్రి మురళీకృష్ణరెడ్డి, పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, నూకరాజు, రాయుడు శ్రీను, ఎన్ రవికుమార్, దిడి రమేష్, బొడ్డేటి కిరణ్, హబీబ్ పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార: ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో గ్లకోమా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సూపరెంటిండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి మాట్లాడుతూ బిపి, సుగర్ ఉన్నవారితో పాటు 40ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీనికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. వారం రోజులపాటు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమణ, గ్లకోమా కన్సల్టెంట్ డాక్టర్ సౌజన్య, డాక్టర్ వాణిశ్రీ, పిఎంఒఒలు ఉమా శ్రీనివాస్, సురేష్, హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బలక్ష్మి, సుజాత పాల్గొన్నారు

కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి

- పలు సమస్యలపై జెడ్‌సికి అపార్ట్‌మెంట్ వాసుల వినతి



జెడ్‌సికి సమస్యలను విన్నవిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ డి బ్లాక్‌లో చెత్త కాల్చడం వలన వెలువడే పొగ కాలుష్యం నివారణ చర్యలు చేపట్టాలని తోకాడ సమైక్య, సిరి, గ్రీన్‌లైఫ్, స్వర్ణసాయి నాలుగు అపార్ట్‌మెంట్‌ల ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు కోరారు. ఈమేరకు సోమవారం గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా కాలనీలకు రహదారి, వీధిదీపాలు, మురుగుకాలువలు, వీధిమార్గం తెలిపే బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాలసీజన్‌లో తోకాడ చెరువు కట్టతెగి, కుంచుమాంబ కాలనీ ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలని, తోకాడ చెరువును అభివృద్ధి చేసి, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. నివాస సముదాయంలోని భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని, పందుల, వీధికుక్కల బెడద లేకుండా చేయాలని కోరారు. శ్రీనగర్, ఆటోనగర్ మీదుగా మింది లేదా షీలానగర్ వైపు ఆర్‌టిసి రింగురోడ్డు సర్వీసులను నడపాలని, ఎపిఐఐసి సెంట్రల్ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలను నెలకొల్పాలన్నారు. జెడ్‌సికి వినతిపత్రం అందజేసిన వారిలో ఎ.తవిటయ్య, శ్రీనివాస్ చౌదరి, నారాయణరావు,చిరంజీవి, మహారాణా, ఎండీఆలీ ఉన్నారు.

ఆలయ స్థలంలో వేసిన రోడ్డు తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



ప్రొక్లెయినర్‌తో రోడ్డు తొలగిస్తున్న జివిఎంసి సిబ్బంది

ప్రజాశక్తి - సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు నక్కవానిపాలెంలో ఏడుగుడులు పరదేశమ్మ ఆలయంలోంచి రాత్రికిరాత్రే వేసిన రోడ్డును జివిఎంసి అధికారులు తొలగించారు. దీనిపై గ్రామకమిటీ అధ్యక్షుడు వి.ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ పద్మారెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళన చేపట్టగా, దీనిపై 'గుడి భూభాగంలో రోడ్డు నిర్మాణం ఆపాలని ఆందోళన' శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి జివిఎంసి అధికారులు స్పందించారు. ఆలయ స్థలం, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వేసిన రోడ్డును సోమవారం తొలగించామని పిపిఒ ప్రమీల తెలిపారు.

ఎన్నికల నియమావళి పై అవగాహన

ప్రజాశక్తి- భీమునిపట్నం: ఎన్నికల నియమావళిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ పత్రాల దాఖలు, వాటి పరిశీలన, గడువు, ప్రచారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలను వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన మౌలిక సదుపాయాలను వివరించారు. 40 శాతం వైకల్యం, అనారోగ్యంగా బాధపడుతున్న 85 ఏళ్లు పైబడిన వారికి ఇంటివద్దనుంచే ఓటు వేసే అవకాశం ఈసారి కల్పిస్తున్నారన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే 'సి'విజన్ యాప్ ద్వారా ఫోటోలు తీసి పంపవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సువిధ పోర్టల్, ఎంకోర్ యాప్ నుంచి అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఆన్‌లైన్‌లో దాఖలు చేసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో తహసీల్దార్ టి గోవింద్, ఎలక్షన్ డిటి డి.భాస్కరరావు, రాజకీయపార్టీల ప్రతినిధులు గాడు శ్రీను, ఆర్ ప్రభాకర నాయుడు, డిఎన్ రాజు, గంటా నూకరాజు, పంచకర్ల సందీప్, ఇఎన్ఎస్ చంద్రరావు, రజనీకాంత్ పాల్గొన్నారు.

175 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో 175 మంది జగనన్న ఇళ్ల లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను సోమవారం సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు అందజేశారు. విఆర్‌ఒ ఎ.కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి ఎస్ సూర్యాదేవి పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు

ప్రజాశక్తి -గాజువాక: జెవికె. పవన్ 11వ వర్ధంతి సందర్భంగా సోమవారం నడుపూరులో పేద కుటుంబాలకు బియ్యం, కాయగూరలను పవన్ సేవా ట్రస్టు ఛైర్మన్ జెర్రిపోతుల ముత్యాలు పంపిణీ చేశారు. ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జెర్రిపోతుల వెంకటలక్ష్మీ, లంకా ప్రియాంక పాల్గొన్నారు.

యాదవులను బిసి 'ఎ'లో చేర్చాలి

ప్రజాశక్తి -తగరపువలస : అన్ని రంగాల్లోనూ వెనుక బడిన యాదవులను బిసి 'ఎ'లో చేర్చాలని ఉత్తరాంధ్ర యాదవ సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో పల్లా వెంకటరావు అధ్యక్షతన సంఘ ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి జి అప్పారావు, ఎం రామలింగం, బి వెంకటరమణ, ఎం కృష్ణ, అక్కరమాని రాము నాయుడు, పిట్టా సురేష్ పాల్గొన్నారు.

పాత ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జోన్ కార్యదర్శి రమణి

ప్రజాశక్తి-పెందుర్తి : గతంలో ఇచ్చిన పాత ఇళ్లపట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాలని, ఇప్పటికే ఖాళీ జాగాల్లో నివసిస్తున్న వారికి వెంటనే ఇళ్లపట్టాలను మంజూరు చేయాలని సిపిఎం జోన్ కార్యాదర్శి బి.రమణి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఇచ్చిన పట్టాలు రిజిస్ట్రేషన్ కానందున చెల్లుబాటు కావడం లేదన్నారు. నివాసంలో ఉండి, పట్టాలు లేనివారికి వెంటనే మంజూరు చేయాలని కోరారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు జగన్, సిఐటియు నేతలు అప్పలనాయుడు, శంకరరావు పాల్గొన్నారు

ప్రాంగణ నియామకాలలో 8 మంది ఎంపిక

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం అమర్‌రాజా బ్యాటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఎనిమిది మందిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు.ఎంపికైన విద్యార్థులకు రూ.2.4 లక్షలు వార్షిక వేతనం ఉంటుందని కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ టి హరిప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కరస్పాండెంట్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ ,మెకానికల్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ప్రజా చైతన్యమే ప్రజాస్వామ్యానికి రక్ష

ప్రజాశక్తి -ములగాడ: పౌరులు చైతన్యవంతులైనప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతమౌతుందని చిత్రకారులు సుంకర చలపతిరావు అన్నారు. సోమవారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ఆధ్వర్యంలో పత్రికలు - ప్రజాస్వామ్యంపై సదస్సు నిర్వహించారు.పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి. శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ హక్కులను తెలుసుకుని బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. క్రాంతినగర్‌లో మహిళా సాధికారతపై, త్రినాథపురంలో రాజకీయరంగంలో మహిళల పాత్రపై సదస్సులు జరిగాయి. సామాజిక కార్యకర్త ముస్తారీ బేగం, ఎన్ఎస్ఎస్ పిఒలు భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, వి.అంజలీదేవి మాట్లాడారు.

అవంతిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎఐసిటిఇ సౌజన్యంతో బ్రెనో విజన్ సంస్థ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. నాలుగు రోజుల వర్క్‌షాప్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, కో ఆర్డినేటర్లు పి సుదర్శనరావు, జి రమాదేవి, ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు

ఇందిరమ్మ అభయహస్తంపై ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని. తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ మహిళా నేత మాకెన లక్ష్మి అన్నారు. సోమవారం ఆరిలోవ ముస్తాఫా కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచుతూప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎపికి ప్రత్యేక హోదాతోపాటు పేద కుటుంబాలకు ఇందిరమ్మ అభయహస్తం పేరిట ప్రతినెలా రూ.ఐదు వేలు ఆర్థికసాయం ఇస్తామని ప్రచారం చేశారు. కాంగ్రెస్ నేతలు గుత్తుల శ్రీనివాసరావు, గోవిందరాజు, తలారి సురేష్, కాకినాడ చినబాబు, కె.వి.సూర్యనారాయణ, మూత వెంకటరావు, భాషా పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-చీడికాడ: విజయవాడలో ఈనెల 10న జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో అక్షర శ్రీ విద్యానికేతన్ విద్యార్థిని ప్రగడ రాజీ రోషిని ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ నెల మూడో తేదీన జరిగిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో రోషినీ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు స్కూల్ కరస్పాడెంట్ బొబ్బిలి మధు తెలిపారు. స్కూల్ సిబ్బంది అబినందించారు.

వంతెన శంకుస్థాపన ఎన్నికల స్టంటే

మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత

ప్రజాశక్తి -కోటవురట్ల: అధికార పార్టీ నాయకులు పందూరు వంతెన శంకుస్థాపన అంటూ ఎన్నికల స్టంట్ మొదలు పెట్టారని మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత హెద్దేవా చేశారు. సోమవారం ఆమె పందూరు వంతెన సమీపంలో అధికార పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని చూపిస్తూ గ్రామస్తులను మభ్య పెట్టేందుకే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. గతంలో మొదలుపెట్టిన పనులకు తిరిగి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదు సంవత్సరాల జ్ఞాపకం రాని వంతెన ఇప్పుడు అంత ఆర్భాటంగా శంకుస్థాపన ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జానకి శ్రీను, యువ నాయకులు తిరుమలరావు, సుంకర బాబ్జి, జనసేన పార్టీ నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలింపు నిలిపివేత

ప్రజాశక్తి-చీడికాడ: రోడ్డు నిర్మాణం పేరుతో గ్రావెల్ అక్రమంగా తరలిస్తుండటంపై విలేకరుల ఫిర్యాదు మేరకు స్థానిక తహసిల్దార్ ప్రకాష్ రావు నిలిపివేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి మండలానికి చెందిన వైసిపి నేత రోడ్డు నిర్మాణం పేరుతో స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుండి 300 ట్రాక్టర్ల లోడ్లు గ్రావెల్ను తరలించేందుకు అడవిల అగ్రహారానికి చెందిన ఒక సర్వే నెంబర్ ను సమర్పించారు. తహసిల్దార్‌కు చూపిన సర్వే నెంబర్ కాకుండా వేరే చోట నుండి గ్రావెల్ తరలిస్తుండటంతో విలేకరుల బృందం తహసిల్దార్ కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసిల్దార్ తరలింపును నిలిపివేశారు. గ్రావెల్ తరలింపునకు రెవెన్యూ కార్యాలయం నుండి ఎటువంటి అనుమతులు ఇవ్వడం జరగదని, మైనింగ్ శాఖ నుండి అనుమతులు తెచ్చుకోవాలని తహసిల్దార్ ప్రకాష్ రావు తెలిపారు.

కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడుతో సోమవారం భేటి అయ్యారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో ఇరుపార్టీల నాయకులను సమన్వయం చేసుకుంటూ పని చేస్తామని వెల్లడించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, కార్యకర్తలు కలిసికట్టుగా కష్టించి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, నాలుగు మండలాల అధ్యక్షులు, ఉత్తరాంధ్ర ప్రచార కమిటీ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, గొలుగొండ మండల సీనియర్ నాయకులు సహదేముడు, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నర్సీపట్నం రూరల్ అధ్యక్షులు మోపాడ చిరంజీవి పాల్గొన్నారు.

సమాధుల స్థలాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన నర్సీపట్నంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న బ్రిటిష్ సేనానులు కవర్డ్, హైటర్ సమాధుల స్థలాన్ని పరిరక్షించి, ఆక్రమణదారులను తొలగించి, అభివృద్ధి పరచాలని అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు కోరారు. సోమవారం ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ, 1922లో నర్సీపట్నం దామనాపల్లి ఘాట్ రోడ్‌లో అల్లూరి, బ్రిటిష్ సేనలకు మధ్య జరిగిన భీకర యుద్ధంలో హతులైన బ్రిటిష్ సేనానులు కవర్డ్, హైటర్ల సమాధులు అర ఎకరం వరకు ఉన్న స్థలాన్ని గతంలో పురావస్తు శాఖకు అప్పగించడం జరిగిందని తెలిపారు. నర్సీపట్నం సిపిఐ కార్యదర్శి జి.గురుబాబు, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శి శివంగి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంత వేలం పాట ఖరారు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో రోజువారి వారపు సంత వేలం పాట ఖరారు అయినట్లు కార్యదర్శి నరసింహారావు తెలిపారు. రోజువారి పాట రూ.67000, వారపు సంత రూ.26,800 కు ఖరారు అయినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధాకృష్ణ, సచివాలయ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని చోద్యం గ్రామంలో సోమవారం జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలను నర్సీపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు 52 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మణికుమారి, వైస్ ఎంపీపీ ఆదినారాయణ పాల్గొన్నారు.

విఆర్ఒకు బాధ్యతలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కోటవురట్ల: తహసిల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారుల కొరతపై ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు అధికారుల నుండి స్పందన లభించింది. ఉప తహసిల్దార్ అన్నాజీ రావు ఇచ్చిన సమాచారం మేరకు ఇటీవల అనారోగ్యానికి గురై సెలవుపై ఉన్న రాజుపేట గ్రామ రెవెన్యూ అధికారి సూర్యనారాయణ స్థానంలో ఇన్చార్జిలను నియమించారు. సోమవారం అనకాపల్లి నుంచి బదిలీపై వచ్చిన బి.రమేష్‌కు తిరిగి రాజుపేట, రామన్నపాలెం, సంకపూరు, జల్లూరు, గ్రామాల రెవెన్యూ బాధ్యతలు అప్పగించారు.

డి పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో డి పట్టాలను లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 30 సంవత్సరాల నుండి సాగు చేస్తున్న రైతులకు డీ పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో నర్సీపట్నం నియోజకవర్గంలో 1200 మందికి డి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. నాతవరం మండలానికి సంబంధించి 146 మందికి గాను 147 ఎకరాలు, గొలుగొండ మండలానికి సంబంధించి 234 మందికి 365 ఎకరాలు, నర్సీపట్నం మండలానికి సంబంధించి 62 మందికి 60 ఎకరాలకు సాగు హక్కు పట్టాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, నాతవరం ఎంపిపి సాగిన లక్ష్మణమూర్తి, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి పాల్గొన్నారు.

అంచనా బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రత్నం అధ్యక్షతన జరిగిన సవరణ, అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు .2023-24 సవరణ బడ్జెట్ రాబడులు రూ.6శాతం, 84,48,000, వ్యయం రూ.60,82,77,700, ముగింపు నిల్వ రూ.1,70,300లు, 2024-25 సంవత్సరపు అంచనా బడ్జెట్ రాబడులు రూ.66,92,92,800, వ్యయం రూ.66,90,30,370 లు, ముగింపు నిల్వ రూ.2,62,430లు బడ్జెట్‌ను రూపొందించారు. ఎంపీడీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, ఏవో సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలను స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎస్‌బిఐల వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కేంద్రం ఒత్తిళ్లకు తలొగ్గి, వివరాలను వెల్లడించలేదని, అత్యున్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ఎస్‌బిఐ, ప్రధాని మోడీ వైఖరికి నిరసనగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు.
(ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం)

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం

● సుప్రీం ఆదేశాల మేరకు వివరాలు బహిర్గతం చేయాలి ● ఎస్‌బిఐల వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు



అనకాపల్లిలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పాత జైలురోడ్డులో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన బ్రాంచ్ ఎదుట సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యానధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, 2019 ఏప్రిల్ నుంచి కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్లు వివరాలను తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. భారత అత్యున్నత న్యాయస్థానం మార్చి 6 నాటికి ఎన్నికల బాండ్లు ఎవరు ఎంత కొనుగోలు చేసారో వాటి వివరాలు ఎన్నికల కమిషన్‌కు ఇవ్వాలని, వాటిని మార్చి 13 కల్లా ఎన్నికల కమిషన్ బహిర్గతం చేయాలని గత నెల 15వ తేదీన సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. ఈ ఆదేశాలను ఎస్‌బిఐ ఛైర్మన్ బేఖాతరు చేయడం కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోవడమేనని పేర్కొన్నారు. ఈ వివరాలను 21 రోజుల్లో ఇవ్వలేమని 116 రోజులు అంటే జూన్ 30 వరకు గడువుకావాలని ఎస్‌బిఐ కోరడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి భయపడి ఎన్నికల తరువాత ప్రకటిస్తామని చెప్పడమంటే సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలోతొక్కడేమన్నారు. రోజుకు రూ.48 కోట్ల సాధారణ ఖాతాలను నిర్వహిస్తున్న ఎస్‌బిఐ కేవలం 22 వేల ఖాతల వివరాలను తెలియజేయడానికి 116 రోజులు గడువు ఎందుకని ప్రశ్నించారు. 2 వేల బాండ్లు ద్వారా రూ.8970 కోట్లు కొనుగోలు చేస్తే అత్యధిక బాండ్లు ద్వారా రూ.6566 కోట్లు బిజెపి పొంది అగ్రస్థానంలో ఉందని, అందుకే దీనిని మోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందని వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన ఎస్‌బిఐ చైర్మన్ తక్షణమే రాజీనామాచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల బాండ్ల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటాగా తీసుకోవాలని కోరారు. బిజెపి ప్రభుత్వం అదాని, అంబానీలకు దేశ సంపదను కట్టబెట్టడం ద్వారా రూ.లక్షల కోట్లు ఆ పార్టీకి ముడుపులు అందుతున్నాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, ఎం.సుబ్బారావు, యుఎస్ఎన్.రాజు నాయకులు కె.కుమారి, చంద్రమౌళి, చలపతి, గణేష్, నర్సింగరావు, రమణ,అప్పారావు పాల్గొన్నారు.

అనకాపల్లి: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల బాండ్లు వివరాలను ఎస్‌బిఐ వెంటనే ప్రకటించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నెహ్రూ చౌక్ వద్ద గల ఎస్‌బిఐ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ గత నాలుగేళ్ళలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి ఇచ్చిన బహిర్గతపరచాలని సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బిఐ బేఖాతరు చేయడం దారుణమన్నారు. తన కార్యకలాపాలన్నింటినీ డిజిటలైజ్ చేసిన ఎస్‌బిఐ, ఎన్నికల బాండ్ల వివరాలను కొద్ది రోజుల్లో పొందుపరిచి ఇవ్వలేక పోయిందంటే నమ్మశక్యంగా లేదన్నారు. జూన్ 30 నాటికి సమాచారం ఇస్తామని ఎస్‌బిఐ తెలపడమంటే, ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా వుండేందుకు, మోడీ ప్రభుత్వ ఒత్తిళ్లు ఉన్నట్లు వెల్లడవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, కె.తెల్లయ్యబాబు, కె.ఈశ్వరరావు, ఎస్.రమణ, బి.నూకఅప్పారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కంచరపాలెం : సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన ఊర్వశి జంక్షన్ స్టేట్ బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించారు. మోడీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా నినాదాలు చేశారు. సిపిఎం జిల్లా నాయకులు బి పద్మ, జోన్ సెక్రటరీ బొట్టా ఈశ్వరమ్మ, నాయకులు ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, ఎస్ సోమేశ్వరరావు, పి రామారావు, పి.వెంకటరావు, పుష్ప, టి చిట్టిబాబు, దామోదర్, పి.మూర్తి, కుమారి, ఏ అప్పారావు పాల్గొన్నారు.

ఆరిలోవ : సిపిఎం అఖిల భారత కమిటీ పిలుపుమేరకు ఆరిలోవ దుర్గాలమ్మ గుడి దరి ఎస్‌బిఐ వద్ద ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలోధర్నా నిర్వహించారు. ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్, ఆరిలోవ జోన్ కార్యదర్శి వి.నరేంద్ర కుమార్, సభ్యులు పి.శంకరరావు, ఎస్ రంగమ్మ, డి నాగరాజు, కే సత్యనారాయణ, ఐ సి హెచ్ నాయుడు, లక్ష్మి, అరుణ, వై అప్పారావు, సన్యాసమ్మ, దేవుడమ్మ, గురుమూర్తి ఉన్నారు.

తగరపువలస: స్థానిక మెయిన్ రోడ్డులోని ఎస్‌బిఐ బ్రాంచి ఎదుట సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ జోన్ నాయకులు రవ్వ నరసింగరావు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

గాజువాక: గాజువాక ఎస్‌బిఐ వద్ద ఎ.లోకేష్ అధ్యక్షతన, సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పార్టీ జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల బాండ్ పథకాన్ని రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ నేతలు కె.సంతోషం, వర్మ, కెపి.కుమార్, ఎం శ్రీదేవి, వై శరత్‌చంద్ర, సుబ్బరాజు, వై సత్యనారాయణ , కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురం ఎస్‌బిఐ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు కె.పెంటారావు, ఆర్.విమల, పి.సూర్యనారాయణ, బి.రాంబాబు, డి.రాము, సూరిబాబు, పైడిరాజు, సంతోష్, సిహెచ్. లక్ష్మి డి.పాప, ఇందిర పాల్గొన్నారు.

పెందుర్తి: సుజాతనగర్ ఎస్‌బిఐ బ్రాంచ్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు జగన్, జోన్ కార్యదర్శి రమణి, సిఐటియు నాయకులు అప్పలనాయుడు, శంకరరావు అధికసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం ఎస్‌బిఐ ఎదుట సిపిఎం ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు, కడారి అప్పారావు, నాయుడు, కనకారావు, శ్రీరాములు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక ఎస్‌బిఐ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వివి.శ్రీనివాసరావు, ఎస్.బ్రహ్మాజీ, నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, టెక్కలి జగ్గప్పారావు, పెంటకోట సత్యనారాయణ, లోవేశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ఎస్‌బిఐ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం నాయకులు గండి నాయన బాబు, ఎర్ర దేవుడు, కక్కల దేముడు, సూరెడ్డి లక్ష్మి, సబ్బవరపు శివ పాల్గొన్నారు.

సబ్బవరం : ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించే విషయంలో ఎస్‌బిఐ వైఖరిపై సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ఎస్‌బిఐ వద్ద నిరసన తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి, నేతలు ఉప్పాడ సత్యవతి, మొల్లేటి గౌరీశ్వరరావు, అప్పారావు, బంగారమ్మ పాల్గొన్నారు.


గాజువాకలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

కశింకోట : కసింకోట ఎస్‌బిఐ బ్రాంచ్ వద్ద సిపిఎం నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఆ పార్టీ నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డిడి.వరలక్ష్మి, నాగమణి, శ్రీదేవి, అమ్మాజీ, పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బిఐ వెల్లడించాలన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. స్థానిక బ్యాంక్ వద్ద ఎన్నికల బాండ్లు విదానం రద్దు చేయాలని ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎల్.గౌరీ, కెవి.సూర్యప్రభ, ఈరెల్లి చిరంజీవి, పండియ్య, రాజబాబు, రాజు తదితర్లు పాల్గొన్నారు.

నక్కపల్లి: ఎన్నికల బాండ్ల వివరాలు బయట పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ డిమాండ్ చేశారు. స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.భూలోక, బి.నూకరాజు, సిహెచ్.సోమేష్, ఎం. లోవరాజు, ఎం.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం: మండలంలోని అడ్డరోడ్డులో ఎస్‌బిఐ వద్ద సిపిఎం నేతలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎం సత్యనారాయణ, నాగేశ్వరరావు, త్రిమూర్తులు, రమణ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్థానిక ఎస్‌బిఐ వద్ద సిపిఎం నేతలు నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, ఆనందరావు, సింహాచలం పాల్గొన్నారు.



ఆరిలోవలో సిపిఎం ధర్నా



మునగపాకలో నిరసన నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు



అరకులోయలో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని రావణాపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జి.మాడుగుల మండలం కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన బాలరాజు మృతి చెందాడు.. వివరాల్లోకి వెళితే చింతపల్లి నుంచి వస్తున్న ఆర్టీసి బస్సు ద్విచక్ర వాహనంను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా బాలరాజు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై కృష్ణారావు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. వివరాలివి. జాతీయ రహదారిపై చంద్రంపాలెం వద్ద సోమవారం రోడ్డు దాటుతుండగా అపార్ట్‌మెంట్ వాచ్‌మ్యాన్ దొప్పా అప్పలస్వామి(60)ని విశాఖ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పలస్వామికి తీవ్రగాయాలు కాగా, స్థానికులు గీతం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందినట్లు సిఐ తెలిపారు. మృతుని భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.ప్రమాదానికి కారణమైన బైకిస్ట్ పరారయ్యాడు.

200 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-చింతపల్లి: ముందస్తు సమాచారంతో 200 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు చింతపల్లి అదనపు ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని లోతుగడ్డ పంచాయతీ చెరుకుం పాకలు జంక్షన్ వద్ద ఎస్ఐ రాజారావులు సోమవారం ఉదయం ఐదున్నర గంటల నుంచి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ ట్రాలీతో వస్తుండగా తమ సిబ్బందిని చూసి పరారైయ్యేందుకు ప్రయత్నిం చారన్నారు. గమనించిన పోలీసు సిబ్బంది చాకచక్యంగా వారిని పట్టుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

13 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 18 నుంచి 30వరకు నిర్వహించనున్న టెన్త్ పరీక్షలకు భీమిలి మండలం, జివిఎ సి పరిధిలో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ ఎం.శివరాణి తెలిపారు. పెద మంగమారిపేట, చిట్టివలస బాలురు, బాలికల పాఠశాలలు, ఆర్ తాళ్ళవలస జెడ్పీ హైస్కూళ్లు, సెయింట్ ఆన్స్, పిఎస్ఎం, ఎంపిఎల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జి వి ఎం సి హైస్కూల్, శారద, శశి, తిరుమల హైస్కూళ్లను పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్న 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్షా కేంద్రానికి ఉదయం 8.45 గంటలకే చేరుకోవాలన్నారు. 22 జెడ్పి, గురుకుల ఉన్నత పాఠశాలల నుంచి 709 మంది బాలికలు, 495 మంది బాలురు మొత్తంగా1204 మంది, 18 ప్రైవేట్ పాఠశాలల నుంచి 557 మంది బాలికలు, 848 మంది బాలురు మొత్తంగా 1405 మంది హాజరు కానున్నారని తెలిపారు.

నిరంతర కృషితో నిర్దేశిత లక్ష్య సాధన

ప్రజాశక్తి -ఆనందపురం : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనకు నిరంతరం శ్రమించాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్ఎల్ రావు తెలిపారు. సోమవారం వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యాన శొంఠ్యాం జెడ్పి హైస్కూల్‌లో కెరీర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వృక్ష ఫౌండేషన్ అధ్యక్షులు కాకర సురేష్‌కుమార్. స్కూల్ కమిటీ చైర్మన్ బోద్దపు బంగారురాజు. హెచ్ఎం ఎ జోగారావు, వైస్ చైర్మన్ తాతారావు, పిఇటి ఎల్ కన్నారావు, ఉపాధ్యాయులు గుప్త, రామ్మోహనరావు, రమేష్, నాగేశ్వరావు, ఫౌండేషన్ సభ్యులు సాడి పవన్, సిహెచ్ నాయుడు, జమ్ముల సాయి పాల్గొన్నారు.

248మందికి ఉచిత కంటిపరీక్షలు

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 58వ వార్డు ఎదురువానిపాలెంలో కోరమండల్ ఫెర్టిలైజర్స్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరంలో248మందికి కంటిపరీక్షలు చేసినట్లు సంస్థ హెచ్ఆర్ హెడ్ శ్రీనివాసరావు తెలిపారు. దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. కోరమండల్ సిఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, ఎస్ఆర్ మేనేజర్ శ్రీకాంత్, గ్రామ పెద్దలు తోనంగి వెంకటరమణ, అప్పారావు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

సిఐ రాంబాబుకు సన్మానం

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ విజయవాడ రూరల్ సర్కిల్‌కు బదిలీ అయిన రాంబాబును స్థానిక శ్రీసాయి సన్నిధి ఫంక్షన్ హాల్‌లో రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ అటహోలి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ దంపతులు సిఐ రాంబాబుకు అభినందనలు తెలిపారు. సర్కిల్ పరిధిలోని వై.రామవరం, గంగవరం, అడ్డతీగల, దుచ్చెర్తి పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్లు సంతోష్ కుమార్, రామకృష్ణ, అప్పలరాజు, లతాశ్రీ, సిబ్బంది ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మూడు మండలాల ఎంపీపీలు, జెడ్పిటిసిలు పాల్గొన్నారు.

స్పందనకు 27 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 27 అర్జీలు అందాయి. వీటిని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, ఐటిడిఎ ఏపీవో జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అబుసలాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డియస్.శాస్త్రి, ఏడియంహెచ్ఓ జి.ప్రకాశం, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై సిపిఎం వినతి

ప్రజాశక్తి -ఎటపాక : మండలంలోని గుండాల పంచాయితీ పరిధి గొల్లగట్ట గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందించారు. రోడ్డుకు అడ్డంగా తక్కువ ఎత్తులో కరెంటు లైన్లు వేలాడుతూ ఇబ్బందికరంగా ఉన్నాయని, భారీ వాహనాలు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సిపిఎం నాయకులు తెలిపారు. పలమారు విద్యుత్ సిబ్బందికి తెలిపిన సమస్యను పరిష్కరించలేదని, తక్షణమే విద్యుత్ స్తంభాలు ఎత్తుగా వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, కార్యదర్శివర్గ సభ్యులు ఆకిశెట్టి రాము, రాయనపేట మాజీ సర్పంచి ఇరపా సత్యం, స్థానికులు బొగ్గ వెంకటేష్, గుండి శివ, పూనెం బాలరాజు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన జన శిక్షణా సంస్థ సహకారంతో బీచ్ రోడ్‌లోని బ్రిడ్జి స్కూల్‌లో 6 నెలల వ్యవధి గల ఉచిత కుట్టు శిక్షణ తరగతులను సోమవారం సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో తాము ఇటువంటి కుట్టు శిక్షణ తరగతులు 10 వరకు నిర్వహించామని, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ ఇవ్వడం, కుట్టు మిషను కొనుక్కోవడానికి బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకే రుణాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మహిళలు తమ తీరిక సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనశిక్షణ సంస్థ ప్రతినిధి మనోహ ర్, శిక్షణ కేంద్రం ఇంఛార్జి రమణ కుమారి, లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు. తరగతులు ప్రతిరోజూ ఉదయం 10:30 నుండి 12.30 వరకు ఉంటాయన్నారు.

ప్లాటినమ్ జ్యూయలరీలో బుక్ మార్క్ ట్రెండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్లాటినమ్ జ్యూయలరీలో బుక్ మార్క్ ట్రెండ్ ప్రాధాన్యత పెరిగిందని, ఫ్యాషన్‌కు మెరుగులు దిద్దాల్సిన సమయం ఆసన్నమైందని పిజిఐ ఇండియా బిజినెస్ డైరెక్టర్ పల్లవి శర్మ అన్నారు. ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆభరణాల ట్రెండుతో స్టైల్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు 2024 ఏడాది అంతా తమ కంపెనీ ప్రయోగాలు చేస్తుందని తెలిపారు. ఆభరణాలు కేవలం అందాన్ని పెంచడానికి మాత్రమే కాదని, మానసిక స్థితిని వ్యక్తం చేయడానికి ఒక వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. జీవన శైలికి అనుగుణంగా సమకాలీన డిజైన్లు, ఆధునిక మహిళలకు సరికొత్త విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు : జీకే.వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ పరిధిలో ఆధార నమోద కేంద్రాన్ని సోమవారం సీలేరు ఎస్ఐ రామకృష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మురేగుల పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాల్లో ఆధార్ కార్డులు కొత్తవి నమోదు కాక, చేర్పులు మార్పులు చేయక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నామని గిరిజనులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఆధార్ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించామని పేర్కొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

ఉద్యోగుల ఎపిక్ కార్డు నెంబర్లు ఆన్‌లైన్ చేయాలి
జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పక పాటించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ జిల్లా అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ కొద్ది రోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జెసి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే తమ కార్యాలయాల్లో, ప్రాంగణాల్లో ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తుల ఫొటోలను తొలగించాలని చెప్పారు. విగ్రహాలను మూసి వేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగీ ఎన్నికల ప్రవర్తన నియమావళిలోకి వస్తారని, ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

ఎన్నికలకు సంబంధించి ఉద్యోగుల వివరాలతో పాటు ఎపిక్ కార్డు నెంబర్లను అందించాలన్నారు. ఇప్పటివరకు ఎపిక్ కార్డు నెంబర్లను ఇవ్వని వారందరూ మంగళవారంలోగా ఆన్‌లైన్ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కార్యాలయాల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్, ఆప్కాస్, కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను తమకు అందజేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల్లో వీరి సేవలను కూడా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, డిఎల్‌డిఒ ఆర్.పూర్ణిమాదేవి, జివిఎంసి, పోలీస్,ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల ఫించను రూ.10 వేలకు పెంచాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వికలాంగుల ఫించను రూ.10 వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షులు సురేష్ మీనన్ కోరారు. ఈ మేరకు సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టసభలలో ఎమ్మెల్యే, ఎంపీ పదవులను వికలాంగులకు కేటాయించాలని, రాజకీయ పార్టీలు వికలాంగులకు పథకాలను మేనిఫెస్టోలో తెలియజేయాలని, కెజి టు పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, మూడు 3 చక్రాల మోటారు వాహనాలను విద్య, వయోపరిమితి లేకుండా అందరికీ అందించాలని, అన్ని రకాల బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని, ఏటా రూ.50 వేలు చేయూత కింద ఆర్థిక సాయం చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, అమూల్య, గణేష్, ఒ.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల రాస్తారోకో

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని సూరంపాలెం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో ఆరు నెలల క్రితం సంబంధిత కాంట్రాక్టర్లు గ్రామంలోని వీధి కులాయిల పైపులైను తొలగించారని, అప్పటినుండి గ్రామంలో నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని వాపోయారు. ప్రస్తుతం ఎండాకాలం నేపథ్యంలో సమస్య మరింత తీవ్రతరమైందని పేర్కొన్నారు. రాస్తారోకో చేయడంతో రహదారిపై గంటల తరబడి వాహన రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో స్పందించిన హైవే నిర్మాణ అధికారులు మూడు రోజుల్లో పైపులైన్ వేయించి తాగునీటి సదుపాయం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'డయిల్ యువర్ మేయర్'కు 20, 'జగనన్నకు చెబుదాం'కు 84 వినతులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యలయంలో నిర్వహించిన 'డయిల్ యువర్ మేయర్'కు 20, 'జగనన్నకు చెబుదాం' (స్పందన)కు 84 వినతులు వచ్చాయి. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాధన్ అర్జీలు స్వీకరించారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కారించాలని జివిఎంసి అధికారులకు మేయర్, అదనపు కమిషనర్ ఆదేశించారు.

అనుముకొండ సురేష్ మృతి బాధాకరం



ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ
అనుముకొండ సురేష్ మరణ వార్త చాలా బాధ కలిగించిందని వార్వా, నివాస్ నాయకులు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌమ్యుడు, స్నేహశీలి అయిన సురేష్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా, మెడికల్ రిప్రజెంటేటివ్ సంఘం రాష్ట్ర నాయకునిగా పనిచేశారని పేర్కొన్నారు. ఆ అనుభవంతో తదనంతర కాలంలో విశాఖ సిటీ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. ఆ తర్వాత సిహెచ్ఎల్ఎన్ శాస్త్రి, జి.విజయ్‌కుమార్, సురేష్ తదితరులు కలిసి అప్పటి ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ సలహాపై వార్వాను ఏర్పాటుచేశారని, వార్వా ప్రథమ ప్రధాన కార్యదర్శిగా ఆయన అపూర్వమైన సేవలందించారని గుర్తుచేశారు. వార్వాకు గుర్తింపు తెచ్చారని పేర్కొన్నారు. విశాఖ నగరంలో ప్రజా సమస్యలపై అకుంఠిత దీక్షతో పని చేసి, వార్వా వృద్ధికి నిర్మాణాత్మక కృషి జరిపారని తెలిపారు. తర్వాత ప్రజాశక్తిలో బాధ్యతలునిర్వహించారని పేర్కొన్నారు. అటువంటి నాయకుడు సురేష్ మృతి బాధాకరమని, వార్వా నివాస్ తరపున ఆయనకు అశ్రు నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సురేష్ సంతాప సభ మంగళవారం ఉదయం 10.30 గంటలకు విశాఖ జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేస్తున్నట్లు వార్వా, నివాస్ ప్రతినిధులు తెలిపారు.

ఆధునికీకరించిన శివాజీ పార్కు ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి జోన్ -3 పరిధిలో రూ.1.53 కోట్లతో ఆధునికీకరించిన శివాజీ పార్కును ఎంపీ ఎంవివి సత్యనారాయణ, కార్పొరేటర్ గేదెల లావణ్యతో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు ఆహ్లాదం కోసం నగరంలో పార్కులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శివాజీ పార్కులో వాటర్ ఫౌంటైన్‌లు, మోడరన్ లైటింగ్, ఎంట్రన్స్ బీటీ రోడ్డు, ఎలివేషన్, ఓపెన్ యాంపీ థియేటర్, మరుగుదొడ్ల ఆధునీకరణ, సెంట్రల్ ప్లాజా, శివాజీ విగ్రహంతో పాటు పలు ఫౌంటైన్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోనికి తెచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులతో పాటు వైసిపి నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో సత్యకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్ డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యాన మార్చి 8న జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిపిన వివిధ పోటీలలో తెలుగు విభాగ స్నాతకోత్తర విద్యార్థి కె.సత్య వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తెలుగు విభాగ సమావేశమందిరంలో అభినందన సభ ఏర్పాటుచేసి ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, డాక్టర్ బూసి వెంకటస్వామి, ఆచార్యులు డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

16వ వార్డులో ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గంలో వైసిపి సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ చేపట్టిన పాదయాత్ర 58వరోజు సోమవారం ఇసుకతోట రామాలయం నుంచి ప్రారంభించారు. వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి అప్పారావుతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఏకకాలంలో అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'తూర్పు'లో జోరుగా టిడిపి ప్రచారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : తూర్పు నియోజకవర్గ పరిధి ఎంవిపి.కాలనీ సెక్టార్-3లో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పట్టాభిరామ్ ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీచేసి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెక్కంటి సత్తిబాబు, పూసపాటి రాజు, రాజు, చినిపిల్లి నరేంద్ర, కళావతి, వాసు, దేముడుబాబు, ఈశ్వరరావు, శివ, కనక, పాల్గొన్నారు

ముమ్మరంగా పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు : ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు నుండి గంజాయి అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం రావడంతో సీలేరు పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే ఆదివారం రాత్రి భద్రాచలం వయా సీలేరు మీదుగా విశాఖపట్నం వెళ్లే బస్ సర్వీసును స్థానిక ఏపీ జెన్కో చెక్ పోస్ట్ వద్ద పోలీసులు ఆపి బ్యాగులు, సంచులు, సామాగ్రిని క్షుణ్ణంగా తనిఖీలు చేసి విడిచి పెట్టారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో మావోయిస్టుల కదిలికలపైనా ఎస్ఐ రామకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. అనుమానిత వ్యక్తుల్ని ప్రశ్నించి విడిచిపెడుతున్నారు.

జనసేన జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-అడ్డతీగల : మండలంలోని అడ్డతీగల గ్రామంలో జనసేన మండల నాయకులు తాటికొండ రాజేంద్ర ఆధ్వర్యంలో ఆ పార్టీ జెండాను సోమవారం ఆవిష్కరించారు. ముందుగా అడ్డతీగలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు కాకి స్వామి, జిల్లా కార్యదర్శి నర్సి ఎర్రయ్య, నాయకులు చారపు వెంకటరాయుడు, కోడె రవిబాబు, గొర్లె సాగర్, సురేష్, గవర్రాజు, వీరేంద్ర, టిడిపి నాయకులు మేడిశెట్టి శ్రీను, కామన బుజ్జి, కె.నానిబాబు, బిత్తరి భూదేవి, బటాని వరలక్ష్మి, బిజెపి నాయకులు పండు పాల్గొన్నారు.

8వ రోజుకు లారీ ఓనర్ల దీక్షలు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఎర్రంపేట ప్రభుత్వ కలప అడితి ఎదురుగా లారీ ఓనర్స్ అసోసియేషన్ చేపట్టిన నిరాహార దీక్షలు 8వరోజుకు చేరుకున్నాయి. కలప డిపోలో ఏజెంట్లుగా పనిచేస్తున్న అజయ్ కుమార్, రామకృష్ణ, వరప్రసాద్, అటవీ శాఖ డిఆర్ఓ, రేంజర్ అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిపై అటవీ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 8వ రోజు దీక్షకు భద్రాచలం లారీ అసోసియేషన్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పి.సత్యనారాయణ, ప్రవీణ్, బాబీ, శ్రీను, నరేష్, కృష్ణ, కోట్ల సూర్య ప్రకాష్, నక్క శ్రీను, వెంకట్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.